7

# నిరహంకారులైన శ్రీ శేషుదేవులు

# సేవకుని వలె శిష్యులకు సేవ చేసేవారు

1980 లో శ్రీశేషుసత్సంగము ఏర్పడిన తదుపరి కాలములో గురువుగా శిష్యులకు ఆధ్యాత్మిక శిక్షణ ఇస్తున్నప్పటికీ, సత్యబోధ చేయుచున్నప్పటికీ, ఏనాడూ తాను గురువునని గానీ, బోధకుడినని గానీ, సత్పురుషుడినని గానీ, భావించేవారు కాదు, అంగీకరించేవారు కాదు. ఆయన ఇలా భావించేవారు. "భగవంతుని యొక్క శక్తి నాలోనికి కొద్దిసేపు వచ్చి సత్యబోధ చేసి మరల వెళ్ళిపోవుచున్నారు. ఆ శక్తితోగానీ, ఆ సత్యబోధతోగానీ నాకెట్టి సంబంధము లేదు. ఆ శక్తి నాలో ఉన్న సమయములో గానీ, నానుండి వెళ్ళిపోయాకా గానీ నేనెప్పుడూ సామాన్య మనుష్యుడనే అయి ఉన్నాను. ఒక బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న వ్యక్తి రోజూ కొన్ని కోట్ల ధనాన్ని ఇతరులకు ఇస్తూ, తీసుకుంటూ ఉంటాడు, కానీ ఆ ధనములో ఒక్క రూపాయి కూడా అతనిది కాదు. అతడు ఆ డ్యూటి చేసినందుకు అతనికి కొంత జీతాన్ని ఇస్తారంతే. అలాగే ఈ సత్యబోధ, ఆధ్యాత్మిక జీవితముతో నాకెట్టి సంబంధము లేదు. ఇది నా ఉద్యోగ బాధ్యత మాత్రమే. ఆ శక్తి కొద్దిసేపు నా దేహములోకి వచ్చి ఉపయోగించుకున్నందుకు ప్రతిగా నాకు సుఖము, లాభము వంటి ఫలాలను జీతముగా ప్రసాదిస్తుందంతే. శిష్యులైన మీలో ఎవరైనా నన్ను గురువుగా భావిస్తుంటే అది ఆ సత్యశక్తికే చెందుతుంది తప్ప నాకు ఏమాత్రము చెందదు. మీరు ఆ శక్తిని చూడలేరు కాబట్టి నన్ను గురువుగా నమస్కరిస్తున్నారు. మీ నమస్కారాలన్నీ నేను ఆ శక్తికే అర్పించుచూ మధ్యలో పోస్టుమేన్‌లాగ ప్రవర్తించుచున్నాను. మీకు గురువై సత్యబోధ చేస్తున్న ఆ సత్యశక్తి యెడల గురుత్వమును, భక్తిని కలిగియుంటే మీకు మేలు జరుగుతుంది. కాబట్టి మీకు అట్టి భావము కలుగుటలో సహకరించుటకే నేను మీవద్ద గురువులా నటన చేయుచున్నానంతే. నేను గురువుననే భావము నా మనస్సుకు గానీ, బుద్ధికి గానీ అణుమాత్రమైనా లేదు. నేను ఈ సత్సంగములో అందరికంటే చివరివాడినే గానీ



continue...

నేనేమీ గొప్పవాడిని కాదు. చిన్నవారిపైనే భగవంతునికి ఎక్కువ ప్రేమ ఉంటుంది కాబట్టి చిట్టచివరి వాడినైన నా దేహమును ఉపయోగించుకుని కర్మ చేయుట ద్వారా నాకు జీతము నిచ్చుచూ సేవ చేయుచున్నారంతే" అని శ్రీ శేషుబాబు గారు చెపుతూ ఉండేవారు, అదే ఎల్లప్పుడూ నమ్ముతూ ఉండేవారు. గురుస్థానములో ఉండికూడా శిష్యులను అత్యధికముగా ప్రేమించుటయే కాకుండా, ఒక సేవకునివలె శిష్యులందరికీ సేవ చేసేవారు. శిష్యులెవరైనా ఊరికి వెళ్ళుచుంటే శ్రీ శేషుబాబుగారే స్కూటర్‌పై తీసుకువెళ్ళి బస్సు ఎక్కించేవారు. శిష్యులెవరైనా పొరుగూరు నుండి వస్తుంటే ఎంత రాత్రి సమయములో వస్తున్నాగానీ బస్టాండు దగ్గర వేచి ఉండి బస్సు వచ్చినాక ఆ శిష్యుడిని స్కూటరుపై ఎక్కించుకుని ఇంటికి తీసుకువచ్చేవారు. సత్సంగానికి అవసరమైన పళ్ళు, కిరాణా సరుకులు, నూనెడబ్బాలు మొదలగునవి అన్నీ శ్రీ శేషుబాబుగారే కొని స్కూటరుపై తెచ్చేవారు. ఆయనలో ఏనాడూ తాను గురువునని గానీ పెద్దవాడినని గానీ భావము లేదు. కనుకనే శిష్యులపై ప్రేమతో ఎంత అల్పమైన పనియైనాగానీ ఎట్టి అహంభావము లేకుండా శిష్యుల కొరకు సేవ చేస్తూ ఉండేవారు.

22-11-1998 వ తేదీన శ్రీ శేషుబాబుగారిలో అవతారుడు మేల్కొనే వరకు ఆయన ఎప్పుడూ తాను గురువునని గానీ, సత్యబోధకుడినని గానీ అణుమాత్రమైనా భావించలేదు, ఒప్పుకోలేదు. అవతారునిగా మేల్కొనిన తరువాత మాత్రమే "నేనే భగవంతుడిని, నేనే సద్గురువుని, నేనే గురువుని" అని అంగీకరించినారు.

